క్లుప్తంగా

అక్షయ పాత్రను సందర్శించిన నారా భువనేశ్వరి



మంగళగిరి (తాడేపల్లిరూరల్) : మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరులో ఉన్న అక్షయ పాత్రను శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి సందర్శించారు. అక్షయపాత్ర ఫౌండేషన్ సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ డొక్క సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం ద్వారా 30 వేల మంది పిల్లలకు అక్షయ పాత్ర నుంచి దాదాపు 25 వాహనాలతో ఇన్సులేటెడ్ కంటైనర్లతో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు భోజనం అందిస్తోందన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ లాభాపేక్ష లేని సంస్థ అని, మధ్యాహ్న భోజనం ద్వారా పిల్లల్లో పోషకార లోపాన్ని పరిష్కరించడానికి కృషి చేస్తోందని అన్నారు. ఇలాంటి ప్రదేశానికి రావడం చాలా సంతోషాన్నిచ్చిందన్నారు. అనంతరం బియ్యంను శుభ్ర పరిచే యంత్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అక్షయపాత్ర మంగళగిరి అధ్యక్షులు వంశీధర దాస, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టీటీడీ పాలకమండలి సభ్యులు తమ్మిశెట్టి జానకీదేవి పాల్గొన్నారు.

ముగిసిన ఆధార్ క్యాంప్



ఫిరంగిపురం: అల్లంవారిపాలెంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఆధార్ క్యాంప్ శుక్రవారం ముగిసింది. క్యాంప్‌లో ఇప్పటి వరకు కొత్త ఆధార్ కోసం 27 మంది నమోదు చేసుకున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు. బయోమెట్రిక్ కోసం ఏడుగురు, ఆధార్ అప్‌డేట్ కోసం 8 మంది వచ్చినట్లు వివరించారు. డేటా ఆపరేటర్లు లక్ష్మణ్, గణేష్ భార్గవ్, షేక్.షాహిదా, అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి, మునగపాడు గ్రామాల్లో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కంజుల పద్మావతి ప్రారంభించారు. 23 పశువులకు గర్భకోశ పరీక్షలు, 44 పశువులకు నట్టల నివారణ మందు, 238 జీవాలకు షీప్ ఫాక్స్ వ్యాక్సిన్ వేసినట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ తెలిపారు. పాడి రైతులకు మందులను సర్పంచ్ అందజేశారు. గ్రామస్తులు టి. బైరాగిరెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరిలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు మాస్టర్ నరేంద్ర తెలిపారు. మంగళగిరి పరిధిలోని కాజ గ్రామంలో శుక్రవారం ఈగల్ మార్షల్ ఆర్ట్ క్లబ్‌లో తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. కలర్ బెల్ట్ టెస్ట్‌లో మంగళగిరికి చెందిన ధనుష్ రెడ్ బెల్ట్ సాధించగా, లిఖిత్, సోమహర్ష ఎల్లో-1, బి.జశ్వత, భువన్, డి.జశ్విత, సాయి కార్తీక్, జైశ్రీకర్ రెడ్డి, లిఖిల్‌రెడ్డి, మోక్షిత్‌రెడ్డి, నేహశ్రీ, ధీరజ్, ఇషిత ఎల్లో బెల్ట్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు.

కార్పొరేషన్ ఇల్లు లాంటిది



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మార్పు చెందిన తర్వాత శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపించేందుకు శానిటేషన్ ఎక్స్‌పర్ట్ ఉదయ్ సింగ్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయ్‌సింగ్ తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయంలో శానిటేషన్ సెక్రటరీలకు, సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ఇల్లు లాంటిదని, పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శానిటేషన్ సిబ్బంది కూడా తమకు ఇచ్చిన గ్లౌజులను జాగ్రత్తగా తీసుకోవాలని, లోపల ఫేస్ పౌడర్ వేస్తే చాలాకాలం మన్నుతాయన్నారు.

ఇష్టమొచ్చినట్లు వీఓఏల ఊస్టింగ్..!

- అయిన వారికి కట్టబెట్టేందుకు టీడీపీ నేతల పట్టు
- తాడికొండ నియోజకవర్గంలో 28 మంది తొలగింపు
- కంతేరులో ఒకే రోజు నలుగురిని తప్పించిన వైనం
- అధికార పార్టీ నేతలకు అనుకూలంగా లేకపోవడమే వారి తప్పు
- పొట్టకొడుతున్నారంటూ బాధితుల ఆవేదన



తాడికొండ: ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గమైన తాడికొండలో పేద వర్గాలే టార్గెట్‌గా అరాచక పాలన కొనసాగుతోంది. తమ వారికి ఉద్యోగాలు కట్టబెట్టేందుకు ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాలనే నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలను అడ్డగోలుగా ఉద్యోగాల నుంచి తొలగించి, ఉసురు పోసుకుంటున్నారు. ఈ తంతు అంతా ఓ సామాజికవర్గ పెద్దల కనుసన్నల్లో నడుస్తుండటం విశేషం. ఓ కీలక ప్రజా ప్రతినిధి కార్యాలయం నుంచి నేరుగా ఆయా విభాగాలకు ఆదేశాలు అందుతుండటంతో అధికారులు కూడా చేసేదేమీ లేక తొలగింపులు చేపట్టి.. చేతులు దులుపుకుంటున్నారు.

28 మంది తొలగింపు..

నియోజకవర్గంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని వెలుగు వీవోఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)ల 28 మందిని తొలగించి, ఆ పోస్టులను టీడీపీ నాయకులు తమ వారికి కట్టబెట్టారు. తొలగించిన వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారే అధికంగా ఉన్నారు. ఇందులో అత్యధికంగా ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన 14 మంది, మాదిగ సామాజిక వర్గం- 1, బీసీలు- 7, ఎస్టీలు-2, ఓసీలు-4 ఉన్నారు. వీరందరూ తప్పు చేసి లేదా అవినీతికి పాల్పడం వల్ల తొలగించబడలేదు. కేవలం అధికార పార్టీకి చెందిన బడా నాయకులకు అనుకూలంగా లేని కారణంగా వారిని తొలగించారు. తొలగించిన వారి స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాంటూ వారు గ్రామాల్లో ప్రచారం చేసుకుంటుండటం మరో విశేషం. కుటుంబాలను పోషించుకుంటూ ఏళ్ల తరబడిగా ఉద్యోగాలు చేస్తున్న తమ పొట్టకొట్టేందుకు అధికార పార్టీ నాయకులు చేస్తున్న ఈ ఆగడాలను చూసిన ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

ఒకే రోజు కంతేరులో నలుగురు..

తాడికొండలో మొత్తం 13 మంది వీఓఏలున్నారు. గురువారం ఒక్క రోజే టీడీపీకి చెందిన ఓ నాయకుడు కంతేరులో తన వారికి ఉద్యోగాలు కట్టబెట్టాలని ఫాం హౌస్‌లో కూర్చొని హుకుం జారీ చేశారు. దీంతో గ్రామంలో ఉన్న 4 వీవోఏలను ఒకేసారి తొలగించి, టీడీపీ అనునాయులకు ఉద్యోగాలు కట్టబెట్టేశారు.

- మేడికొండూరు మండలంలో 11 మంది వీఓఏలను ఇప్పటి వరకు ఉద్యోగాల నుంచి తొలగించారు. తుళ్ళూరు-2 ఫిరంగిపురం-2 వీవోఏల విషయంలో టీడీపీ నాయకులు తమ పంతం నెగ్గించుకున్నారు. అధికారులపై వరుస ఒత్తిళ్లు తీసుకొచ్చారు. మిగిలిన గ్రామాల్లో చేసినట్లు తమ గ్రామంలో ఎందుకు తొలగించరంటూ ప్రజా ప్రతినిధి కార్యాలయం నుంచి షాడో నాయకుడు అధికారులపై పెత్తనం చేశారు. వీఓఏల తొలగింపులో తాడికొండ నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలవడం ఖాయమని బాధితులు అంటున్నారు. ఒక్క వెలుగు ప్రాజెక్టు పరిధిలోనే ఈ స్థాయిలో పేదల ఉసురు పోసుకున్నారంటే మిగిలిన విభాగాల్లో జరుగుతున్న తంతు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని అంటున్నారు. ఇకనైనా ఈ తంతుపై దృష్టి సారించి పేదల ఉసురు తీసే వ్యవహారానికి ఫుల్ స్టాప్ పెట్టి, ఉద్యోగుల కడుపులు కొట్టే వ్యవహారాన్ని నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త బాల వజ్రబాబు

తాడికొండ: పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు తప్పక ఉంటుందని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, గుంటూరు నగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు అన్నారు. శుక్రవారం తుళ్లూరు మండలం నేలపాడు, శాఖమూరు గ్రామాల్లో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులను, సామాన్య పేదలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని, పేదలు పింఛన్లు, సంక్షేమ లబ్ధి కోసం అధికార పార్టీ నాయకుల ఇళ్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. రాజధాని ప్రాంతంలో రైతులు, రైతు కూలీలకు ఉపాధి లేదని, స్థానిక ప్రజలు తన దృష్టికి ఈ విషయం తీసుకొచ్చారని చెప్పారు. బీడువారిన భూములు సాగుచేసుకొని గేదెలు మేపుకొనేందుకు పశుగ్రాసం, స్వల్ప కాలిక పంటలు పండించుకొని పొట్టపోసుకుంటుంటే సీఆర్డీఏ అధికారులు దున్నేయడం సరికాదన్నారు. త్వరలో ఏకాభిప్రాయంతో గ్రామ, మండల కమిటీల నియామకాలు ఏర్పాటు చేసేందుకు ముందుకెళుతున్నామని తెలిపారు. ఈ కమిటీల్లో కష్టపడే వారికి తప్పక స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండలాధ్యక్షుడు బత్తుల కిషోర్, కొప్పుల శేషగిరిరావు, నాయుడు నాగేశ్వరరావు, ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు, దానం వినోద్ నేలపాడు గ్రామ నాయకులు కొయ్యగూర వినోద్, ఇందుర్తి అప్పారావు, కొప్పుల శిరీష, గొట్టం నాగమల్లేశ్వరరావు, శాఖమూరు గ్రామ నాయకులు తుమ్మూరు వరప్రసాద్ రెడ్డి, జొన్నకూటి రాము, బెజ్జం రాంబాబు పాల్గొన్నారు.

రెండు నెలలు.. సాగు భూములు దున్నొద్దు

మంత్రి నారాయణను వేడుకున్న రాజధాని ప్రాంత రైతులు



మంత్రి నారాయణకు తమ గోడు చెప్పకుంటున్న రాజధాని ప్రాంత రైతులు

నేలపాడు(తాడికొండ): రాజధాని ప్రాంతంలో పనుల్లేని కారణంగా ఖాళీగా ఉన్న భూముల్లో పశుగ్రాసం, స్వల్పకాలిక పంటలు సాగుచేసుకుంటున్న రైతులకు చెందిన పంటలను దున్నివేయకుండా తమకు 2 నెలలు అవకాశం కల్పించాలని రాజధాని రైతులు మంత్రి నారాయణను కోరారు. శుక్రవారం రాజధానిలో నిర్మాణాలను పరిశీలించేందుకు విచ్చేసిన మంత్రి నారాయణను హైకోర్టు ర్యాపిడ్ ఫౌండేషన్ వద్ద కలిసిన రైతులు తమగోడు వెళ్లబోసుకున్నారు. సీఆర్డీఏ అధికారులు రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయనే సాకుతో సాగులో ఉన్న భూములను నిలువునా దున్నివేస్తున్నారని, దీని కారణంగా తమకు తీరని నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున నిలుపుదల చేయించాలని కోరారు. రెండు నెలల్లో పంటలు చేతికొస్తాయని తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పంటలను దున్నే ప్రక్రియ కొనసాగుతున్నందున వెంటనే సదరు అధికారులకు సూచించాలని మంత్రిని కోరగా అధికారులతో మాట్లాడుతానని చెప్పి వెళ్లిపోయారు. అయితే స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో రైతులు మీమాంశలో పడ్డారు.

కార్పొరేట్ విద్యా సంస్థలకు తొత్తుగా కూటమి ప్రభుత్వం



వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

తాడేపల్లిరూరల్ : కార్పొరేట్ విద్యా సంస్థలకు కూటమి ప్రభుత్వం తొత్తుగా మారిందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ అన్నారు. తాడేపల్లి పరిధిలోని ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యాలయంలో శుక్రవారం ఉన్నతాధికారి సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ప్రయివేట్ కళాశాలలు విద్యార్థులను ఫీజులు చెల్లించాలని తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. ర్యాంకుల కోసం విద్యార్థుల మధ్య తారతమ్యం సృష్టిస్తూ వారి మరణాలకు కారణమైన కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఓ విద్యార్థి మనస్తాపానికి గురై మూడవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా కనీసం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా తొత్తుగా మారుతోందని విమర్శించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కూడా స్పందించకపోవడం హేయమన్నారు. పీడీఎస్‌యూ నాయకులు గణేష్, శివ, రాజు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ ప్రధానికి అవమానం



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలో దేశ తొలి ప్రధాని నెహ్రూ బొమ్మ తల తొలగిపోయింది. మొండెం ఒక్కటే కనిపిస్తోంది. విగ్రహానికి తల తొలగిపోయినా ఒక్క నాయకుడు కూడా పట్టించుకోవడం లేదు. ఆదివారం గణతంత్ర దినోత్సవం వస్తున్నా దేశ ప్రథమ ప్రధాని విగ్రహం మరమ్మతులు చేపట్టలేదు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్, మంగళగిరి పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉండవల్లి సెంటర్, రామకృష్ణ హాల్ ఏరియా, జామ్ ఆయిల్, సాయినగర్ ప్రాంతాల్లోను, మంగళగిరి పట్టణ పరిధిలోని గండాలయ్య పేట, కొత్తపేట, ఆర్ అండ్ బీ బంగ్లా రోడ్డు, హాస్పిటల్ రోడ్డు, మెయిన్ బజార్, ఎయిమ్స్ గేటు, ఎకో పార్క్, ఇందిరా నగర్, ఎల్‌బీ నగర్, ఆంజనేయ కాలని, క్యాంప్ ఏరియా, ఇప్పటం రోడ్డు, గణపతి నగర్, డీజీపీ కార్యాలయం, ఆత్మకూరు ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌ను సందర్శించిన జేసీ



రైతుల వివరాలు సేకరిస్తున్న జేసీ భార్గవ తేజ, ఏసీ పవర్ స్వప్నిల్ జగన్నాథ్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని అగ్నిప్రమాదానికి గురైన శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు పంట నష్టపోయిన రైతులతో నష్టపరిహారంపై చర్చించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ శుక్రవారం కోల్డ్ స్టోరేజ్‌కు వచ్చారు. రైతులు తమకు జరిగిన నష్టాన్ని ఆయనకు వివరించారు. అనంతరం స్థానికంగా ఉన్న మార్కెట్ యార్డులో నష్టపోయిన 299 మంది రైతులు ఉండగా 250 మంది వద్ద పంట వివరాలతో కూడిన బాండ్లను, ఆధార్ కార్డులను, బ్యాంకు ఖాతా నెంబర్ల పత్రాలను జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ సేకరించారు. రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



అమీనాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, చిన్నారుల తల్లులు

ఫిరంగిపురం: మేరికపూడి ఎంపీపీ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ సునీత విద్యార్థులకు బాల్య వివాహాల అనర్థాలను వివరించారు. అనంతరం బాల్య వివాహాలను వ్యతిరేకిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.పద్మావతి, హెచ్ఎం శ్రీదేవి, గాయత్రీ, సీతా, భార్గవి, కృష్ణ, శాంతి, ఆరోగ్యమేరి, సుజాత పాల్గొన్నారు.

- మండలంలోని అమీనాబాద్ బీఆర్‌సీ హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ మహాలక్ష్మీ విద్యార్థులు అత్యవసర టోల్ ఫ్రీ నంబరు వాడే విధానం, ఆరోగ్య సంరక్షణ, బాల్య వివాహాలు దుష్పరిణామాలు వివరించారు. ఉపాధ్యాయులు, మహిళ పోలీసు కరిష్మా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు లక్ష్యంతో ముందుకు సాగాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆరోగ్య శాఖ అధికారిణి



బాలికలకు సూచనలు ఇస్తున్న డాక్టర్ అనూష

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): బాలికలు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని జీవితంలో ఎదిగేందుకు కృషి చేయాలని దుగ్గిరాల జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభాదేవి సూచించారు. శుక్రవారం పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఇందిర మాట్లాడుతూ బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. దీంతో చదువులో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. సహాయ ఆరోగ్యాధికారి జానమ్మ, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ వి.బుజ్జి, ఆశ కార్యకర్తలు సుకుమారి, విమల, స్వరూపరాణి, మాధవి పాల్గొన్నారు. అలాగే బాలికా దినోత్సవాన్ని పాఠశాలలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగంలోని రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్ సంయుక్త నిర్వహించాయి. రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్ గుంటూరు టీమ్ మెంబర్ లక్ష్మణ్ నందన్, ఐసీడీఎస్ దుగ్గిరాల సెక్టార్ సూపర్‌వైజర్ భవాని మాట్లాడారు. బాలికల హక్కులను వివరించారు. బాలికల రక్షణకు చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ 1098 నంబరు 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. మహిళా పోలీస్ ప్రసన్న, మెంబర్స్ భార్గవి, చెల్సియా పాల్గొన్నారు.

బాలికలకు అవగాహన

తాడేపల్లిరూరల్: పెనుమాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. పెనుమాక అంగన్‌వాడీ సెక్టార్, నవజీవన్ బాలభవన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. సైకాలజిస్ట్ అనూష మాట్లాడుతూ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లను వెలుగులోకి తీసుకురావడానికి ప్రతి సంవత్సరం బాలికల దినోత్సవం నిర్వహించుకొంటున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్ శిరోమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో-ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

బాలల భద్రత అందరి బాధ్యత

తాడికొండ: బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లను అందరికీ తెలియజేసి బాలల భద్రత, ఆరోగ్యం, విద్యను అందించడం అందరూ బాధ్యతగా తీసుకోవాలని తాడికొండ ఎంపీడీవో కె.సమతావాణి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్- క్రాప్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం పోస్టరును విడుదల చేశారు. ఎంఈవో తెనాలి ఇందిర, కేవీకే న్యూట్రిషన్ సైంటిస్ట్ ఎం.దీప, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ సీహెచ్ కళావతి, క్రాప్ జిల్లా కో-ఆర్డినేటర్ జి.వెంకట్ పాల్గొన్నారు.

- తుళ్ళూరు మండలంలో చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఐలు గంగా వెంకటేశ్వర్లు, అంజయ్య, ఎంపీడీవో కానూరి శిల్పా ఎస్ఐ కలగయ్య తదితరులు పాల్గొని పోస్టరు ఆవిష్కరించారు. బాల్య వివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావడంతో పాటు 1098, 100 నంబర్‌లకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ అత్తోట పోతురాజు పాల్గొన్నారు.

భారతరత్న కర్పూరీ ఠాకూర్‌కు ఘన నివాళి



కర్పూరీ ఠాకూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నేతలు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): బిహార్ మాజీ ముఖ్యమంత్రి, భారత రత్న కర్పూరీ ఠాకూర్ జయంతిని మంగళగిరిలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంఘ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు మాట్లాడుతూ పేదల, బడుగుల ఆరాధ్య దైవం కర్పూరీ ఠాకూర్ అని కొనియాడారు. విద్యార్థి నాయకుడిగా ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్‌లో చేసి, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 26 నెలలు జైలు జీవితాన్ని అనుభవించారని తెలిపారు. 1952లో తొలిసారి సోషలిస్ట్ పార్టీ అభ్యర్థిగా తాజ్‌పూర్ నియోజకవర్గం నుంచి విధానసభ సభ్యునిగా ఎన్నికై.. ఆపై రాజకీయాల్లో వెనుతిరిగి చూడకుండా పలుమార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా, బీహార్ రాష్ట్ర మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనత ఆయనదే అన్నారు. సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి కోలా అశోక్, నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్కాపురం కనకారావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

మేడికొండూరు: పలు గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి, పనులను ప్రారంభించారు. భీమినేనివారిపాలెంలో నరుకుళ్లపాడు మేజర్ కెనాల్ కాల్వలో జంగిల్ క్లియరెన్స్, జంగగుంట్లపాలెం రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం, పొట్లపాడులో మినీ గోకుల్ షెడ్ ప్రారంభించి, 15 ఫైనాన్స్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీవో తోట చందన, సర్పంచ్ కల్లి శ్రీదేవి, టీడీపీ మండలాధ్యక్షుడు మల్లిపెద్ది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీని బలోపేతం చేయాలి

తాడికొండ: బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎ.మల్లికల్లు అన్నారు. తాడికొండ ఎస్సీ కాలనీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బహుజనులు బీఎస్పీకి అండగా నిలవాలన్నారు. ప్రతి బీఎస్పీ నాయకుడు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళితే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కూరపాటి సుబ్బారావు, నాయకులు శృంగారపాటి బాబురావు, తెనాలి ప్రకాష్, గూడవల్లి మణికుమారి, ఎం.శ్యామ్, సీహెచ్ భాస్కరరావు పాల్గొన్నారు.

ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

తాడేపల్లిరూరల్: ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్‌లో చర్చ పెట్టాలని ఆర్‌టీఐ జాతీయ అధ్యక్షుడు ప్రత్తిపాటి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ప్రజా సంఘాల సామాజిక నేతలతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తోందని, చట్టబద్ధత ఉన్నందున రిజర్వేషన్ అడిగే హక్కు అణగారిన వర్గాలకు ఉందన్నారు. దేశవ్యాప్తంగా ప్రైవేటు రిజర్వేషన్ చట్టం చేయాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, మార్కెట్, మార్కెటేతర సంఘాలకు రిజర్వేషన్లు విస్తరించాలని పేర్కొన్నారు. మార్చి 5న ప్రయివేటు రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో పెట్టాలనే అంశంపై విజయవాడలో సభను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంసీపీఐ రాష్ట్ర నాయకులు కాసాని గణేష్‌బాబు, సోషలిస్ట్ రాష్ట్ర నాయకులు నవీన్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి



అర్జీ అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

తాడికొండ: రాజధానిలో పారిశుద్ధ్య కార్మికులకు గతేడాది నిలిచిపోయిన పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. 2024 ఏడాదిలో పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం తుళ్లూరులోని సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.రవి మాట్లాడుతూ రాష్ట్రమంతా సంక్రాంతి పండుగ చేసుకుంటే జీతాలు అందక రాజధాని కార్మికులు చేసుకోలేక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సీఆర్డీఏ డీఎల్‌డీవో బొర్రా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్షురాలు సీహెచ్ సునీల, నాయకులు లేళ్ల సుఖవేణి, సీఐటీయూ నాయకులు పేరం బాబురావు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్ : కేజీ గంజాయి స్వాధీనం



తాడేపల్లిరూరల్ : గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. 1.100 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన దాసరి లక్ష్మీనారాయణ మద్యం సేవిస్తూ జులాయిగా తిరుగుతున్నాడని తెలిపారు. ఇతనిపై గతంలో పలు న్యూసెన్స్ కేసులు నమోదైనట్లు చెప్పారు. నవులూరు గ్రామ పరిధిలోని చెరువు కట్ట వద్ద గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారంతో లక్ష్మీ నారాయణను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 10 ప్యాకెట్ల రూపంలో ప్యాక్ చేసిన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కొద్ది రోజుల క్రితం తాడేపల్లి మండలం సీతానగరంలో కొనుగోలు చేసి, విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. నిందితుడిని మంగళగిరి కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. రూరల్ ఎస్ఐ వెంకట్, ఏఎస్ఐ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.